# కొత్తావకాయ్

డా. యల్. కె. సుధాకర్

**నోరూరించే కబుర్లూ కథలూ చెప్పడంలో మా నాయుడు బావకి మించినోడు లేడు. ఆవేళ ఎండ విరగ్గాస్తోంది. చెమట, ఉక్క అదిరిపోతావుంటే చేతుల్లో ఇసనకర్రలు సేద దీరుస్తున్నాయ్. దర్జా దొంగలాగా ఊళ్ళ లోకీ. ఇళ్ళలోకీ ప్రవేశించిన టీవీలు ఖాళీ సమయ మన్న మాటే లేకుండా సేత్తున్నాయ్.**

రాములోరి గుడరుగు మీద కుశాలగా పడుకున్నాడు మా నాయుడుబావ. కుర్రాళ్లు సిగ్నల్ పోయిన కలర్ టీవీ ముందు స్విచ్చులు నొక్కేస్తా కుస్తీలు పడుతున్నారు. బొమ్మ రాడంలే. 'గీతల బొమ్మలెం చేపు సూత్తారు కట్టేయండెహె'' అన్నాడు నాయుడు బావ.



''మేం టీవీ కట్టేయాలంటే నువ్ చెరుకుపానకం లాంటి కవర్లు చెప్తేనే'' అన్నాడు రాముడు.

''ఇవ్వాళ కారంకారంగా ఆవకాయ ఇషయం చెప్తా వింటానంటే'' అన్నాడు బావ.

''సెవటలు కక్కేవేళ కారం కథ ఏం బాగుంటుంది'' అన్నారు కుర్రాళ్లు.

టప్‌మని కరెంటు పోయింది.

కుర్రగేంగుకి ఇనక తప్పిందికాదు కత.

నాయుడు బావ నవ్వేడు. నవ్వి మొదలెట్టేడు ''ఇది కత కాదురోయ్. నిజమే'' అంటూ.

***

''కొత్తపేటలో ఆవకాయ చెట్టంటే – వెంకటస్వామి గారి తోటలో ఈశాన్య మూల వేపునుండే మావిడి చెట్టే. ఏ నక్షత్ర బలంతో – ఏ ముహూర్తాన ఆ విత్తనం నాటాడో గానీ – వెంకటస్వామి – ఆ చుట్టుపక్కల ఆవకాయంటే ఆ చెట్టుకాయ ల్తోనే పెట్టాలని పేరెళ్లిపోయింది. వెంకటస్వామి ఆ తోట కౌలుదారు. మనిషంటే మనిషంత మనిషి. ఆ తోటలో కొబ్బరి చాపమీదో నులక మంచం మీదో కూర్చుని ఆ దారినే సంతకెళ్తొస్తున్న వాళ్ళని పిలిచి మరీ పప్పులో వెయ్యమనో, వేట మాంసంతో కలిపి వండమనో మామిడికాయలిచ్చేవాడు. ఆ దారిలోనే సంతకెళ్లాల్సి రావడంతో, వెళ్లి వచ్చేవాళ్లంతా అక్కడ కాసేపు సేదదీరేవారు. వెంకటస్వామి అందరికీ ఆత్మీయుడే. నాకు మామయ్య వరస.

ఆ చెట్టు కాయలు ప్రసిద్ధేకానీ – అందరికీ అందేవి కావు. పెద్దబ్రాహ్మలాయనింటికీ, చౌదరి గారికీ, ఆ ఊరి ప్రసిడెంట్‌కీ ఇలా పెద్దోళ్లకి సరిపోతుండేవి. వెంకటస్వామి మాత్రం పనిగట్టుకుని ఆ ఊరి ఇస్కూలు హెడ్‌మాస్టారికి కొన్ని పంపించేవోడు. ఇక మనలాంటోళ్లకవి దొరకడమంటే గగనమే.

అలాంటి పరిస్థితుల్లో ఓరోజు ఓ విచిత్రం జరిగింది.

నాకు ఆవకాయ పచ్చడి తయారు చెయ్యాలనిపించింది.''

కుర్రాళ్ళు ముసిముసిగా నవ్వుకున్నారు. అందరివేపూ ఓసారి చూసి మళ్లీ మొదలెట్టాడు బావ.

''నాకు ఆవకాయ పెట్టాలనిపించింది. అదీ వెంకటస్వామి గారి తోటలోని ఈశాన్యం వేపున్న మామిడి కాయల్తోటే. ఆ వేళ రెండో విడత ఆవకాయకోసం బ్రామ్మలింటికి కాయలు పట్టుకెళ్లమని నన్ను పురమాయించాడు వెంకటస్వామి మామయ్య. బ్రామ్మలమ్మాయికి అనకాపల్లి పంపించేందుకు ప్రత్యేకంగా పెడుతోన్న ఆవకాయన్నమాట.

కాయలు తాజాగా కోసి మూటగట్టేనన్నమాటే కానీ... నా మనసంతా అవెలా నా చేతికొస్తాయా అనే వుంది. సైకిలేసుకుని సగం దూరం వెళ్లాక వెనక్కి తిరిగొచ్చేసి – 'మామయ్యా! అన్నపూర్ణమ్మ గారు అనకాపెల్లి ఆల్రెడీ వెళ్లి ఆవకాయ ఇచ్చేసి వచ్చేసేరంట. ఇంక కాయలక్కర్లేదన్నారు' అంటూ పచ్చి అబద్ధమాడేను.

అంతీజీగా దేన్నీ నమ్మని ముసలోడు నా మీదున్న గురి కొద్దీ నమ్మేశాడు. మరిప్పుడేంటి చేయడం అన్నాడు. తాజాతనం పోతే మామిడికాయలు ఆవకాయకి పన్జేయవు.


రెండు క్షణాలు చూసి – పోనీ నేను తీసేసుకోనా అన్నాను.

'ఎంట్రోయ్! కొత్తగా పెళ్లయినోడివి. అరిశెల గురించీ, సున్నుండల గురించీ మాట్టాడాలి గానీ... ఈ ఆవకాయ గొడవేంట్రా నీకు! ఏ... యాపారం మొదలెడదావనా?' అంటూ నవ్వేడు వెంకటస్వామి.

సిగ్గుగా నవ్వేస్నేను.

'సర్లే! పట్టికెళ్లు. ఎలాగూ వృధాయే కదా' అన్నాడు.

ఆవిధంగా మామిడికాయల సంచీ నాదయింది. ఇక ఆవకాయ పెట్టాలి.




నెమ్మదిగా వెంకటస్వామి మామ దగ్గరజేరి 'మామయ్యా! మరి .. మరి... ఆవకాయెట్టాలంటే ఏమేం కావాలి?' అనడిగాను.

గుబురు మీసాల మాటునుంచి ఆ ముసిలోడు నవ్విన పకాలింపు నవ్వు ఇప్పుడిన్నేళ్ల తర్వాత కూడా నాకు గుర్తే... ఏం నవ్వేడులే!!

నవ్వీనవ్వీ... ఆగి... 'మరి అయేం తెలనోడివి మాడికాయలేం చేసుకుంటావురా! ఎదవా!' అన్నాడు. అని.. అన్నీ చెప్పాడు. చెప్తూ... చెప్తూ బోల్డన్ని జీవిత సత్యాలు కూడా చెప్పాడు. ఆ మద్యాన్నం నా జీవితంలో ఓ మరిచిపోలేని టైము.

వెంకటస్వామి మామ మాట మహత్తు అలాంటిది మరి.

'మనిషెప్పుడూ ఆవకాయలాగుండాల్రా నాయుడూ. పైకి ఎర్రెర్రగా వర్రవర్రగా.. రుచ్చూస్తే కమ్మగా.. ఘాటుగా... వదల్లేనంత ఇష్టంగా. మనిషి మనసెపుడూ తాజా మామిడికాయలా నవనవలాడుతూ వుండాలి. గానుగాడించిన పచ్చడి నూనిలాగా ఆలోచనలెప్పుడూ స్వచ్ఛంగా ఉండాలి. పచ్చట్లో ఉప్పుంటే లౌక్యం లాంటిదన్నమాట.

కొంచెం ఎక్కువైతే కశమైపోద్ది. తక్కువైతే తినడానికి రుచుండదు. సరిగ్గా సరిపడా మాత్రమే వుండాలన్నమాట. ఆవపిండంటే మన నడవడి లాంటిది. రుచినిస్తుంది – ఆరోగ్యాన్నిస్తుంది – నోరూరిస్తుంది – ఎదుటివాళ్లకివ్వగలిగినంతగా పచ్చడి పరిమాణాన్ని కలుగజేస్తుంది. ఇంతుందరా అబ్బీ.. ఆవకాయ మర్మం' అంటూ హాయిగా నవ్వేడు గుబురు మీసాల్లోంచి.

నేనింకా ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు.మామయ్య వంకే ఎగాదిగా చూస్తూ.. 'మామయ్యా! నువ్వేం చదువుకున్నావ్?' అన్నాను.

మళ్లీ నవ్వి ... 'మనిషికిలాంటివి తెలియాలంటే చదువే అఖ్ఖర్లేదురా అల్లుడూ. జీవితమంటేనే అది... ఇది అర్థం చేసుకోవడం మర్చిపోయిననాడు, నిర్వచనాలూ మారిపోయి – ప్లాస్టిక్కు సంచుల్లో పచ్చళ్లు అమ్ముకునే కాలం వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అంతా రెడీమేడ్ అయిపోతాయంతే' అన్నాడు లోతైన కళ్లు ఇరవై ఏళ్లు ముందుకు చూస్తున్నట్టున్నాయ్.

***

గోళెం నీళ్లలో మామిడికాయలు పెద్దపెద్ద జాతిరత్నాల్లా మెరుస్తున్నాయ్. వాటిని నానబెట్టి, శుభ్రమైన పొడిబట్టతో తుడిచి, ముక్కలుకొట్టి, ఆవపిండీ, కొత్తకారమూ, నూనె, ఉప్పూ దినసులన్నీ తయారుగా వుంచి ఆ మర్నాటి సాయంత్రానికి ఆవకాయ జాడీని రెడీ చేసేసేను.

ఒరేయ్! కుర్రాళ్ళూ! సొంతంగా వంటగానీ, స్వంతంగా ఆవకాయని గానీ తయారుచేసి చూడండ్రా... ఆ ఆనందమే వేరు. ఇలా ఇప్పట్లా టైం వేస్టు చేయడానికి అప్పట్లో మాకు ఇన్ని సాధనాలు లేవు గనుక మేం అలా చేసీవోళ్లం అనుకోకండొరే. ఒక మనిషి ఇంకో మనిషికి తోడుగా వుండడంలో టీవీలూ, సినిమాలే కాదు.. ఇంకా చాలా వున్నాయ్‌రా జీవితంలో'' అంటూ వేదాంతంలోకెళ్లిపోయాడు నాయుడుబావ.

''అద్సరే! ఇంతకీ మామిడికాయల అబద్ధం సంగతి పెద్దగారికి తెలిసిపోలేదా?'' అనడిగేడు చిన్నగాడు.

''అస్సలు తెలియలేదు. తెలిస్తే సంపేయరూ!''

''కానయితే.. నాకే బయమేసి ఆ సాయంకాలమే ఇషయమంతా పెద్దమ్మగారు అదే అన్నపూర్ణమ్మ తల్లికి చెప్పేశాను – నేనే'

''సెప్పేసేవా? ... ఎంత ధయిర్నం!'' అన్నాడు సుబ్బిగాడు.

''మరి వెంకటస్వామి మామయ్య ద్వారా తర్వాత్తెలిస్తే ఇంకా పెమాదమని ... ఆలోచించి ఇనయంగా సేతులు కట్టుకుని మొత్తం సెప్పేశాను.''

'ఏమన్నారు? తన్నించేరా? పెద్దగారికి చెప్పేసుంటారు!''

''పన్లోంచి తీసేవుంటారు''

''పళ్లు రాలగొట్టించి గెంటేసుంటారు''

''నోర్మూయండెహె! ఆయమ్మ పుణ్యాత్మురాలు. అంతా ఇని నవ్వేసి.. మగాడివి నీకిదేం ఆలోచనరా! అనడిగేరు.''

''చెప్పేను''

కళ్లింత చేసుక్కని చూస్తూ విన్నారు.

అంతా ఇని.. పెద్దగారికి మొత్తం చెప్పేసేరు.

***

''హా!'' అన్నారు కుర్రాళ్లంతా ఒక్కసారిగా.

ఆరోజుల్లో పెద్దగారి ముందర దొంగతనం చేసినోడు నిలబడ్డవంటే మాటలా! అలాంటిది పెద్దగారింట్లో దొంగతనం లాంటిది కదూ ఈ కేసు. ఏమ్మై వుంటుందో!

అందరి మొగాలకేసీ నవ్వుతూ చూస్తున్నాడు నాయుడుబావ.

అందరినీ వాళ్లవాళ్ల ఆలోచనల కొదిలేసి.

మద్యాహ్నాం ఎండ తీవ్రత ఈ సస్పెన్స్ పుణ్యమాని ఇంకాస్త పెరిగినట్టు అయింది.

బ్రతిమాలించుకుంటాడే తప్ప విషయం చెప్పడు బావ.

ఎదుటి సంస్కారాల్ని ఎలా ఛిత్రం చేయాలనుకుంటుందో చెప్పి మరీ వినాశక పథకాలేసే ఆడ

విలన్ల తాలూకు అస్తవ్యస్త టీ.వీ. కథల తరం వాళ్లు మా కుర్రాళ్లంతా. అందుకే ఎంతాలోచించినా ఆ తర్వాతేం జరిగుంటుందో అర్థం చేసుకోలేకపోతున్నాం.

అంతలో పుల్లయిసు బండొచ్చింది.

కుర్రాళ్లంతా నాయుడు బావని ఐస్‌లు కొనిపెట్టమని అడిగేరు. చిన్నగాడు అందరికీ కొనిపెట్టేలాగా, నాయుడుబావ కథ పూర్తిచేసేలా ఒప్పందం కుదిరింది చివరికి. అయిసు తింటూ కథలో పడ్డారు.

''అంతా ఇని పెద్దగారు పెద్దగా నవ్వేరు.

'బలేవోడివిరా!' అంటూ నవ్వి 'జాడీకి డబ్బులున్నాయా' అనడిగేరు.

నేను మాట్టాడకుండా సేతులుకట్టుకుని తల దించుకునే వున్నాను. కాలుస్తున్న చుట్ట చూసి సిటికెన వేలితో రాల్చేసి, వాలుకుర్చీ కింద నున్న రాగి చెంబులో నీళ్లు తాగి, పైకండువాని దులిపి భుజానేసుకుని లేచి పొలం బయల్దేరబోతూ – 'ఇదిగో ఈడికి జాడీ కొనుక్కోడానికి రెండ్రూపాయలిచ్చి పంపించు' అంటూ వెళ్లిపోయారు.

''కనీసం అమ్మగారయినా కోప్పడలేదా?'' అన్నారు కుర్రాళ్లంతా.

''లేదు... సరికదా ... జాడీ డబ్బులతోబాటు ఆవపిండీ, కొత్త కారం, నూనె కూడా ఇచ్చారు. ఎలా కలపాలో జాగ్రత్తలు చెప్పేరు.''

''ఎందుకు యిదంతా! నిజంగానే ఆవకాయ వ్యాపారం మొదలెట్టావా? ఏంటి?''

''మీ యాపారం బుర్రలకి అంతకంటే తట్టదుగానీ ... ఇనండి –

అప్పటికి ఆర్నెల్లు కావొస్తోంది నాకు పెళ్లయి. లక్ష్మి కొత్త కాపరానికొచ్చింది. పెళ్లయిన మూడోరోజున కొంచెం ధయిర్యంగా మాట్లాడింది నాతో. మాటల్లో తనకి కొత్తావకాయంటే బోలెడంత ఇష్టమని చెప్పింది. అదీ అసలు సంగతి. అదేదో పెద్దమ్మగార్నో వేరెవర్నో అడిగితే ఇంత పెట్టకపోరు.

కానీ సొయంగా... నేనే నాచేత్తో తయారుచేసి... అదీ వెంకటస్వామి మామ వాళ్ల ఈశాన్యంవేపు మామిడిచెట్టు కాయల్తో...

''అదీ దొంగతనంగా'' అందించేడు చిన్నాగాడు.

''మరే... మరే... అలా దొంగతనం చేసి మరీ... తయారుచేసిస్తే అప్పుడు కదా రుచి.. మదురం.. అందుకే అంత సాహసం... అంతా సాయం చెయ్యడమూనూ.

చెప్పిందంతా ఇన్న అన్నపూర్ణమ్మ గారు... 'బావుందిరా! అది మాత్రం కొత్తగా కాపురానికొచ్చింది... నా కూతుర్లాంటిదే కదా. అనకాపల్లి అమ్మాయి గారికి నేను పంపిస్తాలే'' అన్నారు. నిజమే – వెంకటస్వామి మామ చెప్పినట్టు మనుషులు ఆవకాయలాగే వుండాలి.

ఆవకాయ కలిపి, వాసెన కట్టిన పచ్చడి జాడీని తీస్కెళ్లి లక్ష్మికిచ్చాక ఆయమ్మి కళ్లల్లో వెలుగు చూడాలొరే! ఆ వెలుగు కోసమే ఎలాంటి సాహసమైనా చేయబుద్దేస్తుందిరా! ఆ జాడీ అందుకుని .. నోరూరిపోతుండగా... నాకు ఇంకో మంచి ఇషయం చెప్పింది లక్ష్మి...'' కళ్లింత చేసుకుని ఆహ్లాదంగా చెప్పుకుపోతున్నాడు నాయుడుబావ.

మెలిదిరిగిన కండలతోనూ, మీసాల్తోనూ పొన్నుగర్రని భుజాన ఆనించుకొని పైని చందమామ నిండుగా నవ్వుతూన్న వెన్నెల్లో, నీళ్లోసుకున్న అల్లరి పిల్ల ఎంకికి కొత్తావకాయ జాడీనందిస్తోన్న నాయుడుబావ కళ్లముందు మెదిలాడు మా కుర్రాళ్లందరికీ.

కరెంటొచ్చింది.

ఎవరూ టీ.వీ. ఆన్ చేయలేదు.

మనుషుల మమతల్ని గురించి నోరూరించే ఆత్మీయమైన కథ విన్నవాళ్లకి ఇవ్వాళ్టి టి.వి.తో ఏం పని!?

సాయంకాలం చల్లబడుతోందనడానికి గుర్తుగా చల్లగాలి పవనం మా బృందాన్ని చుట్టుముట్టింది.

★




బాలీవుడ్ యంగ్ బాయ్ జాన్ అబ్రహామ్‌కు సైట్ కొట్టే అమ్మాయిల సంఖ్య బాగా పెరిగిపోయిందిట. ఎస్ఎమ్మెస్‌లు, ఇ-మెయిల్‌లు ఇచ్చేవారు ఇంకా ఎక్కువ. ప్రియాంక చోప్రా, సమీరారెడ్డి లాంటి హీరోయిన్‌లు సైతం అబ్రహాం అంటే ఇష్టపడుతున్నారు. అమ్మాయిలను ఇంతగా ఆకర్షించిన జాన్‌కు బిపాసా పర్మనెంట్ లవర్. అమ్మాయిలు సైట్‌కొట్టే విషయమై బిపాషాను అడిగితే, నిద్దురలోనూ, మెళకువలోనూ నేనే అతనికి స్వీట్‌హార్ట్‌ని. అతను మారడు గాక మారడు. ఎంతమంది సైట్ కొట్టినా నన్నే పెళ్లి చేసుకుంటాడు. మా ఇరువురి పేరెంట్స్ కూడా మాపై నమ్మకముంచారు. ఇన్నేళ్ళ మా ప్రేమ ప్రయాణంలో ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయి. జాన్‌ను ఎవరు ఇష్టపడినా అది వన్‌సైడ్ లవ్‌గానే మిగిలిపోతుంది. మేమిద్దరం మేడ్ ఫర్ ఈచ్ అదర్... అంటూ జాన్‌ను తెగ పొగిడేస్తోంది బిపాషా!